రోదసిలో బ్రహ్మాండ సముద్రం

మహా సముద్రాల కన్నా 140 లక్షల కోట్ల రెట్లు పెద్దది

న్యూఢిల్లీ: విశ్వంలోని మారుమూల ప్రాంతంలో ఓ మహా బ్రహ్మాండ జలాశయాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. భూమి నుంచి 1,200 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న క్వాసర్(బ్లాక్ హోల్స్ కలిగిన శక్తి ఉత్పత్తి కేంద్రం) చుట్టూ ఇది తిరుగుతున్నది. నేడు మనం చూస్తున్న కాంతి ప్రయాణం విశ్వం పుట్టిన తర్వాత కొద్ది కాలంలోనే ప్రారంభమైందని ఈ దూరాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఒక కాంతి సంవత్సరం అంటే దాదాపు ఆరు లక్షల కోట్ల మైళ్ల దూరం. నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ ఈ జలాశయాన్ని కనుగొంది. భూమిపై గల మహా సముద్రాల్లోని నీటి మొత్తం కన్నా ఈ మహా బ్రహ్మాండ జలాశయంలోని నీరు 140 లక్షల కోట్ల రెట్లు ఎక్కువ. ఈ జలాశయం ఓ సూపర్‌మాసివ్ బ్లాక్‌హోల్ వద్ద ఉంది. ఇది సూర్యుడి కన్నా 2,000 రెట్లు పెద్దదని పరిశోధకులు తెలిపారు. ఇక్కడి నుంచి 1,000 లక్షల సూర్యులతో సమానమైన శక్తి బయటకు వస్తున్నది. ఈ క్వాసర్ వద్ద ఇప్పటి వరకు మన విశ్వంలో గుర్తించనంత భారీ, సుదూర జలాశయం ఉంది. దీనిపై అధ్యయనం చేస్తున్న బృందాల్లో ఒకదానికి మట్ బ్రాడ్‌ఫోర్డ్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ క్వాసర్ చుట్టూ ఉన్న వాతావరణం చాలా ప్రత్యేకమైనదని ఆయన చెప్పారు. ఇది పెద్ద ఎత్తున నీటిని ఉత్పత్తి చేస్తున్నదన్నారు. ఈ క్వాసర్‌లో నీటి ఆవిరి వందల కాంతి సంవత్సరాల వరకు విస్తరించి ఉందన్నారు. విశ్వంలో అంతటా నీరు విస్తృతంగా ఉందని చెప్పడానికి ఇది మరో సంకేతమని తెలిపారు. క్వాసర్స్‌ను 50 ఏళ్ల క్రితం గుర్తించామని ఆయన తెలిపారు. క్వాసర్స్‌ను అధ్యయనం చేయడం వల్ల ఖగోళ శాస్త్రవేత్తలు విశ్వం ప్రారంభం గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. పాలపుంతలు, నక్షత్రాల పరిణామానికి రూపం ఇవ్వడంలో నీటి పాత్ర చాలా ముఖ్యమైనదని ఆయన వివరించారు.

దిశ చూపిన 'దశ' తీర్పులు

- 2024లో సుప్రీంకోర్టు ఆదేశాలతో కీలక పరిణామాలు
- దేశమంతా పాత నేర చట్టాల స్థానంలో కొత్తవి అమలు
- చేతిలో రాజ్యాంగంతో న్యాయ దేవతకు కొత్త రూపం

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: దేశంలో ఈ ఏడాది(2024) ఎన్నో చారిత్రక తీర్పులకు సర్వోన్నత న్యాయస్థానం వేదికగా నిలిచింది. చట్ట, సామాజిక, రాజకీయ, వివక్ష, గుర్తింపు, జాతి ప్రయోజనాలకు సంబంధించిన ఎన్నో కీలక తీర్పులను సుప్రీం కోర్టు వెలువరించింది. అలాగే ఈ ఏడాది న్యాయవ్యవస్థలో కొన్ని కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. చిరకాలంగా దేశంలో అమలవుతున్న పాత చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్‌బీ)ని ప్రవేశపెట్టింది. అలాగే కళ్లకు గంతలతో ఉండే న్యాయదేవత విగ్రహం స్థానంలో కళ్లకు గంతలు లేకుండా, చేత రాజ్యాంగాన్ని ధరించిన కొత్త న్యాయదేవత విగ్రహాన్ని సుప్రీం కోర్టు ప్రాంగణంలో ఆవిష్కరించారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది దేశం దశ మార్చి సరికొత్త దిశ చూపిన 10 ప్రధానమైన తీర్పులను ఒకసారి అవలోకనం చేసుకుందాం.

☞ **1.బిల్కిస్ బానో కేసు:** బిల్కిస్ బానో అనే మహిళను గ్యాంగ్ రేప్ చేయడమే కాక, ఆమె కుటుంబానికి చెందిన ఏడుగురిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులు 11 మందికి క్షమాభిక్ష పెడుతూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీం కోర్టు ఈ ఏడాది జనవరి 8న కొట్టివేసింది.

☞ **2.ఎన్నికల బాండ్లు:** ఎన్నికల బాండ్ల అమ్మకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీం కోర్టు ఫిబ్రవరి 15న తీర్పు చెప్పింది. రాజకీయ పార్టీలకు ఎన్నికల వేళ విరాళాలు సమకూర్చేందుకు ప్రవేశపెట్టిన విధానం ఎంతమాత్రం సమర్థనీయం కాదని తీర్పు చెప్పింది.

☞ **3. లంచగొండి నేతలు చట్టానికి అతీతులు కాదు:** 'చట్టసభల్లో ఒక వ్యక్తికో పార్టీకో అనుకూలంగా ఓటు వేయడానికో, లేదా ఏదైనా అంశం గురించి మాట్లాడటానికో లంచం, బహుమతులు తీసుకునే ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రాసిక్యూషన్ నుంచి తప్పించుకోలేరు.' అని సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం మార్చి 4న తీర్పు చెప్పింది. 1993లో ప్రధాని పీవీ నరసింహారావుపై అవిశ్వాసం పెట్టిన క్రమంలో ఐదుగురు పార్టీ నేతలు లంచాలు తీసుకోవడంపై నమోదైన జేఎంఎం లంచం కేసులో చట్టసభ సభ్యులకు అనుకూలంగా ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేస్తున్నట్టు ధర్మాసం పేర్కొంది.

☞ **4. ఎస్సీ, ఎస్టీల కోటా ఉప వర్గీకరణ:** ఎస్సీ, ఎస్టీ కులాలను ఉప వర్గీకరణ చేసుకోవచ్చునని సుప్రీం కోర్టు ఆగస్టు 1న చారిత్రక తీర్పు చెప్పింది. ఇలా వర్గీకరణ చేసి ఆయా వర్గాలకు ఉద్యోగాలు, విద్యా సంస్థల ప్రవేశాల్లో అదనపు ప్రయోజనాలు చేకూర్చవచ్చునని తెలిపింది.

☞ **5. చైల్డ్ పోర్నోగ్రఫీ నేరం:** పిల్లలకు సంబంధించిన అశ్లీల మెటీరియల్ కలిగి ఉండటం పోక్సో చట్టం కింద నేరమేనని సుప్రీం కోర్టు సెప్టెంబర్ 23న తీర్పు చెప్పింది.

☞ **6. పౌరసత్వ చట్టం సెక్షన్ 6ఏ:** అస్సాంలోని అక్రమ వలసదారులకు భారత పౌరసత్వం కల్పించే పౌరసత్వ చట్టం సెక్షన్ 6ఏకు రాజ్యాంగ చెల్లుబాటు ఉంటుందని సుప్రీం కోర్టు అక్టోబర్ 17న తీర్పు చెప్పింది.

☞ **7. యూపీ మదర్సా విద్యా చట్టం:** ఉత్తర ప్రదేశ్ మదర్సా బోర్డు విద్యా చట్టం-2004 రాజ్యాంగబద్ధమేనని నవంబర్ 5న సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. యూపీ మదర్సా చట్టం రాజ్యాంగ విరుద్ధమని, మదర్సాల్లో చదువుతున్న విద్యార్థులను అధికారిక పాఠశాల విద్యావ్యవస్థలో చేర్చాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తిరస్కరించింది.

☞ **8. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి మైనారిటీ హోదా:** కేంద్ర చట్ట ప్రకారం ఏర్పడిన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి మైనారిటీ హోదా ఉందని సుప్రీం కోర్టు నవంబర్ 8న తీర్పు చెప్పింది. ఆర్టికల్ 30 కింద రాజ్యాంగపరంగా ఏఎంయూకు ఈ హోదా లభిస్తుందని తీర్పు వెలువరించింది.

☞ **9. బుల్డోజర్ న్యాయం తప్పు:** బుల్డోజర్ న్యాయం పేరిట రాష్ట్రాలు ఇష్టానుసారం కూల్చివేతలు చేపట్టడాన్ని సుప్రీం కోర్టు నవంబర్ 13న తప్పుబట్టింది. బుల్డోజర్ న్యాయంలో కార్యనిర్వాహక వ్యవస్థ న్యాయమూర్తి పాత్రను పోషిస్తూ ఒక వ్యక్తిని దోషి అని నిర్ధారించి శిక్షను వేయడమే కాక దానిని అమలు చేస్తున్నదని.. ఇది తప్పని వ్యాఖ్యానించింది.

☞ **10.కుల ప్రాతిపదికన జైళ్లలో వివక్ష:** కుల ప్రాతిపదికన జైళ్లలో జరుగుతున్న వివక్షపై అక్టోబర్ 13న దేశ అత్యున్నత న్యాయస్థానం చారిత్రక తీర్పు చెప్పింది. శారీరక శ్రమ విభజన, బ్యారక్‌ల విభజన తదితర అంశాలతో కుల ఆధారిత వివక్ష చూపడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది.

ద్రాక్ష పండ్లతో క్వాంటమ్ సెన్సర్ పనితీరు వృద్ధి!



సిడ్నీ, డిసెంబర్ 25: ద్రాక్ష పండ్లపై జరిపిన పరిశోధనలో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సూపర్ మార్కెట్లలో లభ్యమయ్యే సాధారణ ద్రాక్ష పండ్లు క్వాంటమ్ సెన్సర్ పనితీరును మెరుగుపరిచేందుకు దోహదం చేస్తాయని శాస్త్రవేత్తలు తేల్చారు. ద్రాక్ష జతలు మైక్రోవేవ్‌ల కోసం స్థానికీకరించిన అయస్కాంత క్షేత్ర హాట్ స్పాట్లను ఉత్పత్తి చేస్తాయని, తక్కువ ఖర్చుతో చిన్న పరిమాణంలో ఉన్న క్వాంటమ్ సెన్సర్లను అభివృద్ధి చేసేందుకు ఇవి సహాయపడతాయని తమ అధ్యయనంలో తేలినట్టు సిడ్నీ లోని మాక్‌క్వెయిరీ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. ద్రాక్షలు మైక్రోవేవ్ ఒవెన్లలో ప్లాస్మాను, మెరుస్తున్న చార్జ్‌డ్ కణాలను ఉత్పత్తి చేస్తున్న దృశ్యాలతో వారు రూపొందించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ప్లాస్మా ప్రభావాన్ని కలిగించే విద్యుత్తు క్షేత్రాలపై గత అధ్యయనాల్లో దృష్టి సారించినప్పుడు ద్రాక్ష జతలు సైతం అయస్కాంత క్షేత్రాల బలాన్ని రెట్టింపు చేయగలవని రుజువైందని, క్వాంటమ్ సెన్సింగ్ అప్లికేషన్లకు ఇవి ఎంతో కీలకమైనవని మాక్ క్వెయిరీ యూనివర్సిటీ క్వాంటమ్ ఫిజిక్స్ పీహెచ్‌డీ విద్యార్థి అలీ ఫవాజ్ ఓ ప్రకటనలో తెలిపారు.

చారిత్రక రహదారికి ముడా దోపిడీదారు పేరా?

సిద్ధరామయ్య పేరు మైసూరులో ఓ రోడ్డుకు ప్రతిపాదన

ప్రజలను అవమానించడమేనని జేడీఎస్ ధ్వజం

మైసూరు, డిసెంబర్ 25: మైసూరులోని చారిత్రక కేఆర్ఎస్ రోడ్డు పేరు మార్పు ప్రతిపాదన వివాదాన్ని రాజేసింది. ఆ రోడ్డు పేరును సిద్ధరామయ్య ఆరోగ్య మార్గ్‌గా మార్చాలన్న ప్రతిపాదనను జనతా దళ్(ఎస్) తీవ్రంగా వ్యతిరేకించింది.ఎంసీసీకి ఎన్నికైన కౌన్సిల్ లేకపోవడంతో పేరు మార్చే అజెండాను తాము నియమించిన అధికారుల ద్వారా అమలు చేయాలని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ పార్టీ ఆరోపించింది. ప్రభుత్వం నియమించిన అధికారులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రుణాన్ని తీర్చుకునేందుకు ఆయన పేరును కేఆర్ఎస్ రోడ్డుకు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని ఆ పార్టీ ఆరోపించింది. ఈ ప్రతిపాదన మైసూరు చారిత్రక వైభవానికి, ప్రజలకు అవమానమని, పౌరులకు ద్రోహం చేయడమేనని జేడీఎస్ నాయకులు ఆరోపించారు. ముడాను దోపిడీ చేసిన అనివీతి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేరును చారిత్రక నగరంలోని ఒక రోడ్డుకు పెట్టడం మైసూరు ప్రజలనే కాక యావత్ రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని జేడీఎస్ విమర్శించింది.

నిర్వహణా లోపానికి మహా కుంభ్ నమూనా!

యూపీ ప్రభుత్వంపై అఖిలేశ్ యాదవ్ మండిపాటు

సర్కార్‌కు చేత కాకుంటే సాయం చేస్తామని వెల్లడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో త్వరలో జరగనున్న మహా కుంభ మేళాకు జరుగుతున్న ఏర్పాట్ల తీరుపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిర్వహణ లోపానికి రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మాడల్‌గా మారిందని విమర్శించారు. ఈ మెగా కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న భద్రతా ఏర్పాట్లపైనా ఆయన పెదవి విరిచారు. అత్యంత కీలకమైన పోలీసు వ్యవస్థ కూడా నిర్వహణ లోపానికి బలయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా భద్రత, రద్దీ నియంత్రణను పర్యవేక్షించేందుకు వాచ్ టవర్లు, జల్ పోలీస్ స్టేషన్లు కూడా నిర్మించలేదని, సీసీటీవీలను అమర్చలేదని మండిపడ్డారు.

డబ్బు సంపాదనలో బీజేపీ నేతలు బిజీ

డబ్బు సంపాదన యావలో బీజేపీ నేతలు బిజీగా ఉన్నారని, వారికి కుంభ మేళా నిర్వహించడం చేతకాకపోతే ప్రభుత్వానికి సాయం చేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని అఖిలేశ్ పేర్కొన్నారు. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పార్లమెంటు ఎదుట యూపీవాసి

ఆత్మాహుతి యత్నం

ఓ వ్యక్తితో వ్యక్తిగత శత్రుత్వమే కారణం!

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంటు ఎదుట ఓ వ్యక్తి బుధవారం ఆత్మాహుతి యత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌లోని బాగ్‌పట్‌కు చెందిన జితేంద్ర పార్లమెంటు ఎదుట ఉన్న పార్క్‌లో పెట్రోల్ వంటి పదార్థాన్ని ఒంటిపై పోసుకుని ఆత్మాహుతి యత్నం చేశారు. మంటల్లో కాలుతూనే పార్లమెంటు మెయిన్ గేట్ వైపు వెళ్లాడు. 90 శాతం కాలిన గాయాలతో ఉన్న ఆయనను ఓ దవాఖానలో చేర్పించారు. ఆయన వద్ద ఓ డైరీ, రెండు పేజీల సూసైడ్ నోట్ దొరికింది. ఒకరితో వ్యక్తిగత శత్రుత్వం కారణంగానే అతడు ఈ చర్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నది.

బీజేపీ మాటలు చేతలకు

పొంతన లేదు

కెన్-బెట్వా నదుల అనుసంధానంపై కాంగ్రెస్

ఖజురహో(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్-బెట్వా నదుల అనుసంధానం ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఖండ్వా జిల్లాలో ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. కెన్-బెట్వా నదుల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా ఎంపీలోని 10 జిల్లాలకు చెందిన 44 లక్షల మందికి, ఉత్తర్ ప్రదేశ్‌లోని 21 లక్షల మందికి తాగునీటి అవసరాలు తీరనున్నాయి. పర్యావరణంపై బీజేపీ చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు.

ఆయుధాల గర్జన ఆపండి

ప్రపంచ దేశాలకు పోప్ క్రిస్మస్ సందేశం

వాటికన్ సిటీ: ఈ పవిత్ర సంవత్సరంలో ఆయుధాల గర్జనలను ఆపే ధైర్యాన్ని కూడగట్టుకోవాలని, ప్రపంచంలో వ్యాపిస్తున్న విభజనలను అధిగమించాలని పోప్ ఫ్రాన్సిస్ అన్ని దేశాల ప్రజలకు బుధవారం క్రిస్మస్ సందేశం ఇచ్చారు. మధ్య ప్రాచ్యం నుంచి ఉక్రెయిన్ వరకు, ఆఫ్రికా నుంచి ఆసియా వరకు విస్తరిస్తున్న విభజనవాదానికి అడ్డుకట్ట వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఏడాది క్రిస్మస్ 2025 పవిత్ర సంవత్సరంతో పాటు వచ్చింది. మన శత్రువులతోనూ విస్తృత స్థాయిలో సయోధ్య కుదుర్చుకోవాలని,ఆశావాద యాత్రికులుగా మారాలని పిలుపునిచ్చారు.

మణిపూర్‌లో మళ్లీ కాల్పులు

ఇంఫాల్: క్రిస్మస్ వేళ మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. కంగ్‌పోక్పీ జిల్లాలోని సినమ్‌కోమ్ గ్రామంలో ఉదయం 6:30 గంటల సమయంలో దుండగులు కాల్పులు జరిపారు. కొండ ప్రాంతంలో విలేజ్ వాలంటీర్స్ పేరుతో కొందరు బాంబు దాడులకు పాల్పడుతూ కాల్పులు జరిపారని స్థానికులు తెలిపారు. దీంతో హుటాహుటిన భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. మరోవైపు చురాచంద్‌పూర్ జిల్లా లెయిసంగ్ గ్రామంలోని బ్రిడ్జి కింద దుండగులు అమర్చిన 3.6 కేజీల పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఉత్తర కాశీ జిల్లా హర్సిల్ వ్యాలీలోని ఓ రహదారిపై భారీగా చేరిన మంచు

ఉత్తర భారతం గజగజ

- ఢిల్లీలో రైళ్లు, విమానాలు ఆలస్యం
- హిమాచల్‌లో పర్యాటకులకు ఇక్కట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: తీవ్రమైన చలి...దానికి తోడు చల్లని గాలులు ఉత్తర భారతాన్ని గజ గజ వణికిస్తున్నాయి. జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలో బుధవారం ఉష్ణోగ్రతలు సున్నా కన్నా దిగువకు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ, జమ్ముకశ్మీర్, హిమాచల్‌లను మంచు దుప్పటి కప్పేసింది. ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల ప్రజలు చలి తీవ్రత వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. ఢిల్లీకి వెళ్లే 20కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని, దట్టంగా కురుస్తున్న మంచు వల్ల విమాన సర్వీసులు ప్రభావితమైనట్టు అధికారులు బుధవారం ప్రకటించారు. రోడ్ల మీద దట్టమైన పొగ మంచు ఆవరించి ఉండటంతో..వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో భారీ హిమపాతం వల్ల ఎత్తయిన ప్రాంతాలన్నీ మంచుతో నిండిపోయాయి. పలు జిల్లాల్లో రహదారులను మూసేశారు. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల వాహనాలు జారటం వల్ల జరిగిన ప్రమాదాల్లో గత 24 గంటల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.

అమెరికా వయా కెనడా

- భారతీయుల అక్రమ రవాణాకు కెనడా విద్యాసంస్థల సహకారం
- భారత్‌లోని ముఠాలపై ఈడీ దర్యాప్తు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: మానవ అక్రమ రవాణా కేసులో కొన్ని కెనడా కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, భారత్‌కు చెందిన సంస్థల పాత్రపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరుపుతున్నది. కెనడా నుంచి మన పౌరులను అమెరికాలోకి పంపేందుకు కొన్ని ముఠాలు మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయి. కెనడా-అమెరికా సరిహద్దును అక్రమంగా దాటడానికి ప్రయత్నిస్తుండగా తీవ్రమైన చలికి తట్టుకోలేక గుజరాత్‌లోని డింగుచ గ్రామానికి చెందిన ఒక కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు 2022 జనవరి 19న మృతి చెందారు. దీనిపై అహ్మదాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్‌ను పరిగణలోకి తీసుకున్న ఈడీ భవేశ్ అశోక్ పటేల్, కొన్ని భారత సంస్థలపై మనీలాండరింగ్ కేసు పెట్టింది. ఈడీ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ దళారీ ఏజెన్సీలు అమెరికా వెళ్లాలనుకునే వారికి, అమెరికాలో కాకుండా.. కెనడాలోని కొన్ని విద్యాసంస్థలు, యూనివర్సిటీలలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తాయి. కెనడా వీసా వచ్చిన వెంటనే వారు ఆయా విద్యాసంస్థల్లో చేరకుండా అక్రమంగా యూఎస్-కెనడా సరిహద్దు ద్వారా అమెరికా వలసదారులుగా వెళ్లిపోతారు. తర్వాత కెనడాలోని ఆయా విద్యాసంస్థలు కొంత సొమ్ము మినహాయించుకుని విద్యార్థులకు వారు కట్టిన ఫీజును వాపసు చేస్తాయి. ఇలా చేసినందుకు ఆయా ముఠాలు విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి రూ.55-60 లక్షలు వసూలు చేస్తున్నాయి. ఇలా ముంబైలో ఒక సంస్థ ప్రతి సంవత్సరం 25 వేల మంది, మరో సంస్థ 10 వేల మందిని అమెరికా పంపినట్టు ఈడీ వెల్లడించింది.

వాజపేయికి ఘన నివాళి

శత జయంతి స్మారక నాణెం, స్టాంప్ విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపం 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తదితర రాజకీయ ప్రముఖులు బుధవారం నివాళి అర్పించారు. అక్కడే జరిగిన ప్రార్థనా కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, అధికార పక్ష ఎంపీలు పాల్గొని అటల్ సేవలను స్మరించుకున్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రూ.100 స్మారక నాణేన్ని, తపాల స్టాంప్‌ను విడుదల చేశారు.

ఏఐ డ్రోన్లతో భారత్‌కు కొత్త ముప్పు!

న్యూఢిల్లీ: యుద్ధాల్లో డ్రోన్ల వాడకం పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో 2026 నాటికి 10 లక్షల డ్రోన్లను సేకరించేందుకు డ్రాగన్ దేశం ఆర్డర్ పెట్టినట్లు ఆ దేశ సైనిక వర్గాలు ఇటీవల తెలిపాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత తేలికపాటి కమికాజ్ డ్రోన్లను చైనా సైన్యం వాస్తవాధీన రేఖ వెంబడి మోహరిస్తే, భారత్‌కు పెను సవాల్ ఎదురు కానుంది. ఏఐ ఆధారిత డ్రోన్ టెక్నాలజీతో భవిష్యత్తు యుద్ధాలపై ఆధిపత్యం చెలాయించాలని చైనా కోరుకుంటున్నట్లు దీనిని బట్టి అర్థమవుతున్నది.

'తప్పుడు కేసులో ఆతిశీని అరెస్ట్ చేయొచ్చు'

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: బీజేపీ ప్రోద్బలంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని తప్పుడు కేసులోఅరెస్టు చేయవచ్చని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అనుమానం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులో అతిశీని అరెస్టు చేయాలని దర్యాప్తు సంస్థలను బీజేపీ ఆదేశించినట్టు తమకు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందిందని విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచారం చేయకుండా ఆప్‌ను పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నిక నేపథ్యంలో కేజ్రీవాల్ పోటీ చేస్తున్న నియోజకవర్గంలో మహిళలకు రూ.1100 చొప్పున బీజేపీ నగదును పంపిణీ చేస్తోందని ఢిల్లీ సీఎం, ఆప్ సీనియర్ నేత ఆతిశీ బుధవారం ఆరోపించారు.

ఆప్‌తో పొత్తు పొరపాటే: కాంగ్రెస్

ఆప్, దాని జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ బుధవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఆప్‌తో పొత్తు పెట్టుకోవడం తాము చేసిన పొరపాటని ఆ పార్టీ నాయకుడు అజయ్ మాకెన్ తెలిపారు. ఆ తప్పును సరిదిద్దుకోవాల్సి ఉందన్నారు.

కేరళ ప్రభుత్వ ఉద్యోగ దరఖాస్తులు డార్క్ వెబ్‌లో!

వార్త రాసిన జర్నలిస్ట్‌కు పోలీసుల వేధింపులు

తిరువనంతపురం: మధ్యాహ్న డైలీ మలయాళ పత్రిక విలేకరైన అశోకన్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడానికి కేరళ పోలీసులు చేసిన ప్రయత్నాన్ని రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ బుధవారం ఐక్యంగా ఖండించారు. అశోకన్‌కు వారంతా బాసటగా నిలిచారు. కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలకు సంబంధించి 65 లక్షల దరఖాస్తుల డాటాను హ్యాకర్లు డార్క్ వెబ్‌లో ఉంచినట్టు అశోకన్ వార్తను బయటపెట్టారు. దీంతో ఈ సమాచారం ఎలా తెలిసిందో వెల్లడించాలంటూ అశోకన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు పోలీసులు యత్నించడం సంచలనంగా మారింది.

క్రిస్మస్ వేళ విధ్వంస జ్వాల

ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థ లక్ష్యంగా రష్యా భీకర దాడులు

70 క్షిపణులు, 100కు పైగా అటాక్ డ్రోన్ల ప్రయోగం

కీవ్: క్రిస్మస్ పండుగ వేళ ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థ విధ్వంసమే లక్ష్యంగా రష్యా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. కీవి రిహ్, ఖార్కివ్ పట్టణాల్లోని నివాస ప్రాంతాలపై క్రూయిజ్, ఖండాంతర క్షిపణులను కురిపించింది. ఈ దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్నాయి. బుధవారం ఉదయం ఉక్రెయిన్‌పై గగనతల దాడులు జరుగుతాయని హెచ్చరించే సైరన్‌లు మోగాయి. వెంటనే రష్యా నల్ల సముద్రం నుంచి కాలిబర్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. తమ ఇంధన వ్యవస్థపై రష్యా పెద్దఎత్తున దాడులు మళ్లీ ప్రారంభించిందని ఉక్రెయిన్ ఇంధన శాఖ మంత్రి జర్మన్ గలుషెంకో టెలిగ్రామ్ ద్వారా తెలిపారు. సెంట్రల్ ఉక్రెయినియన్ సిటీ క్రీవీ రిహ్‌లెపి అపార్ట్‌మెంట్‌పై మంగళవారం బాలిస్టిక్ మిసైళ్లతో రష్యా దాడి చేసింది. ఈ దాడిలో ఒకరు మరణించగా, 15 మంది గాయపడ్డారు.

ఇంతకన్నా అమానుషత్వం ఏముంటుంది?

రష్యా దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. దాడులు చేయడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ క్రిస్మస్‌ను ఎంచుకున్నారని మండిపడ్డారు. ఇంతకన్నా అమానుషత్వం ఏముంటుందని ప్రశ్నించారు. పుతిన్ ఉద్దేశపూర్వకంగానే క్రిస్మస్ రోజును ఎంపిక చేసుకున్నారని జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా 70 క్షిపణులను, 100కు పైగా అటాక్ డ్రోన్‌లను ప్రయోగించిందన్నారు.

గాలిలో చక్కర్లు కొట్టి కుప్ప కూలింది

అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు ఘోర అగ్ని ప్రమాదం

40 మంది దుర్మరణం..

మాస్కో: అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 40 మంది మరణించగా, 27 మంది గాయపడ్డారు. ప్రయాణికులలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్‌గిస్థానీ పౌరులు ఉన్నారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్న